ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

బుధవారం 23 ఏప్రిల్ 2025



ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో నల్ల బ్యాడ్జీలతో కార్మికుల నిరసన

కోల్‌సిటీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో పని చేస్తున్న మెకానికల్ డిపార్ట్‌మెంట్ కార్మికులు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని మంగళవారం ఆర్‌ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు అంబటి నరేష్ మాట్లాడుతు కంపెనీకి వందల కోట్ల రూపాయల లాభాలను సాధించి పెడుతున్నామన్నారు. కార్మికులకు జీత భత్యాలు చెల్లించకపోతే ఉత్పత్తిని స్తంభింపచేసి ప్లాంట్ ఎదుట బైఠాయిస్తామని హెచ్చరించారు. రత్నం శ్రీనివాస్, కొమురన్న, అఫ్జల్, తస్నీరు నరేష్, రవి, నయీమ్, శ్రీనివాస్, రమేష్, ప్రకాష్, మహేందర్, సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ఆగని అక్రమ వసూళ్లు

● సూపరింటెండెంట్‌కు బదులు ప్రైవేట్ వ్యక్తి ఖాతాకు 2డీ ఎకో డబ్బులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అక్రమ వసూళ్లు ఆగడం లేదు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమ వసూళ్లు' అనే కథనం రావడంతో సూపరింటెండెంట్ ఖాతాలోకి వెళ్లాల్సిన 2డీ ఎకోకు సంబంధించిన డబ్బులు ఓ ప్రైవేట్ వ్యక్తి ఖాతాలోకి మళ్లిస్తున్నారు. సోమవారం ఆసుపత్రిలో 2డీ ఎకోకు వెళ్లిన రోగుల నుంచి ఆప్టికల్ షాప్ నిర్వహించే వ్యక్తికి డబ్బులు స్కాన్ చేయాలంటూ ఓ వైద్యుడు చెప్పడంతో రూ.200లను ఫోన్ పే ద్వారా చెల్లించారు. సిటీ స్కాన్, 2డీ ఎకో చేయించుకునే రోగుల కు అక్కడ స్కాన్ ఏర్పాటుచేసి సిటీ స్కాన్‌కు రూ.2వేలు, 2డీ ఎకోకు రూ.200 వసూలు చేస్తున్నారు. ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించడంతో ప్రైవేట్ వ్యక్తి ఖాతాలోకి జమ చేయాలంటూ రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో పని చేసే ఓ వైద్యుడు పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రి నడుపుతున్నాడు. అతడి భార్య కూడా అదే ఆసుపత్రిలో పని చేస్తుండడంతో తనకు అనుబంధంగా ఆప్టికల్ షాపునకు డబ్బులు మళ్లిస్తున్నారు. ఇలా అక్రమ వసూళ్లు చేస్తున్న వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని రోగులు డిమాండ్ చేశారు.



ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

- ప్రథమ సంవత్సరంలో 62.45 శాతం
- ద్వితీయ సంవత్సరంలో 70.03 శాతం ఉత్తీర్ణత
- గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో జిల్లాలో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. ప్రథమ సంవత్సరంలో 62.45 శాతం ఫలితాలను సాధించి 12వ స్థానంలో నిలవగా, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 70.03 శాతం ఫలితాలను సాధించి రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచారు. ఎంపీసీ, బైపీసీలో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ముందు వరుసలో నిలిచారు. గత ఏడాదితో పోలిస్తే ఫలితాల్లో జిల్లా మెరుగైంది. ప్రథమ సంవత్సరంలో 16.14 శాతం ఫలితాలు పెరగగా, రాష్ట్రస్థాయిలో 19వ స్థానం నుంచి 12వ స్థానానికి రావడం గమనార్హం. ద్వితీయ సంవత్సరంలో 10.71 శాతం ఫలితాలు పెరగగా, 14వ స్థానం నుంచి 11వ స్థానానికి చేరుకున్నది.

● ప్రథమ సంవత్సరం పరీక్షలకు జనరల్ విభాగంలో 3827 మంది విద్యార్థులు హాజరు కాగా, 2659 మంది 62.45 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 1558 మందికి 759 మంది 48.72 శాతం, బాలికలు 2269 మందికి 1631 మంది 71.88 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వొకేషనల్ కోర్సుల్లో 1069

(మిగతా 8వ పేజీలో)

● వచ్చే నెల 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు

ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులు కానీ విద్యార్థులు తిరిగి పరీక్షలు రాసేందుకు వచ్చే నెల 22వ తేదీ రెండు సెషన్లలో అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నారని ఇంటర్ నోడల్ అధికారి బి కల్పన తెలిపారు. ఇందుకోసం ఆయా కళాశాలల్లో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. అలాగే రీ కౌంటింగ్ కోసం ఈ నెల 23 నుంచి 30వ తేదీ లోపు ఒక్కో సబ్జెక్టుకు 1000 రూపాయలు, రీ వాల్యూయేషన్, స్కాన్ చేసిన జవాబు పత్రాల కోసం ఒక్కో సబ్జెక్టుకు 600 రూపాయలు చెల్లించాలని పేర్కొన్నారు.

● ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు..

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో గల మోడల్ స్కూల్‌లో చదువుతున్న ఎస్ స్వప్న ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఎంపీసీలో 1000 మార్కులకు గాను, అత్యధికంగా 984 మార్కులు సాధించారు. సుల్తానాబాద్ ప్రభుత్వ కళాశాలకు చెందిన నవీన్‌కుమార్ 980 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. బైపీసీలో 1000 మార్కులకు గాను 953 మార్కులు సాధించారు. మంథని బాలికల ప్రభుత్వ కళాశాలకు చెందిన శ్రీజ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. గోదావరిఖని ప్రభుత్వ బాలికల కళాశాలకు చెందిన స్ఫూర్తి అనే విద్యార్థి హెచ్‌ఈసీలో 1000 మార్కులకు 978 మార్కులు సాధించారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక

పెద్దపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నిజం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడత లబ్ధిదారుల ఎంపికను అధికారులు పారదర్శకంగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ సచివాలయం నుంచి సీఎస్ శాంతి కుమారి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, హౌసింగ్ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ గౌతమ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పేదవాడు సొంత ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రజా ప్రభుత్వం 5 లక్షల రూపాయలను ఉచితంగా సబ్సిడీ కింద అందిస్తుందని, దేశంలో మరే రాష్ట్రంలో ఇంత పెద్దన సాయం అందడం లేదని, మిగిలిన రాష్ట్రాల్లో లక్షన్నర నుంచి 2 లక్షల వరకు ప్రభుత్వాలు సహాయం చేస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ప్రతీ ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను అందిస్తుందని మంత్రి తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి విడతలో 3500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతి పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని అన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ఈఈ హౌసింగ్, అధికారులు, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల వివాదం

మంత్రి, ఎమ్మెల్యే ఫొటోలు లేకుండా ఎంపీ ఫ్లెక్సీలు ● తొలగించిన కాంగ్రెస్ నాయకులు



ఫ్లెక్సీలను తొలగిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కాలనీతోపాటు సింగరేణి గనులపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కాంగ్రెస్ పార్టీలో వివాదానికి దారితీశాయి. కాలనీలోని పలు కూడళ్లతోపాటు ఆర్జీ-2 ఏరియాలోని గనులపై ఎంపీ గడ్డం వంశీకృష్ణతోపాటు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలు వెలిశాయి. సింగరేణి రిటైర్డ్ కార్మికుల సంఘం పేరిట వెలిసిన ఫ్లెక్సీల్లో మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఫొటోలు పెట్టలేదు. సోమవారం రాత్రి ఫ్లెక్సీలను గమనించిన కాలనీ, వెంకట్రావ్‌పల్లె గ్రామ శాఖ నాయకులు ఫ్లెక్సీలను తొలగించారు. ఎంపీ అనుచరుడిగా ఉన్న మాజీ కార్పొరేటర్ ఫ్లెక్సీలను పెట్టించినట్టు గుర్తించిన కాంగ్రెస్ నాయకులు సదరు నాయకుడిని ప్రశ్నించినట్టు సమాచారం. అంబేద్కర్ జయంతిని సందర్భంగా పట్టణ కమిటీకి సమాచారం ఇవ్వకుండా ఎంపీతో కార్యక్రమం నిర్వహించడంపై స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే ఫోటోలు లేకుండా ఫ్లెక్సీలు పెట్టడంపై రాష్ట్ర కమిటీకి ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

ఓదెల ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం ఇస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఆయన ఆలయ ఒగ్గు పూజారులతో కలిసి సచివాలయంలో మంత్రి చాంబర్‌కు వెళ్లి వినతిపత్రం ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరుతోపాటు ఒగ్గు పూజారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు పెద్దపీట



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లోనే 10 కోట్ల రూపాయలతో మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాచరిక పాలన చేసి పేద ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. వారి పాలనలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 4 కోట్లు, ఎస్.సి సబ్ ప్లాన్ ద్వారా 1.98 కోట్లు, సీఆర్ఆర్ ద్వారా 4 కోట్లు, కలెక్టర్ స్పెషల్ ఫండ్ కింద 2.96 కోట్లతో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. సిఆర్ఆర్ నిధులతో మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు, ఖిలావనపర్తి పోచమ్మ గుడి దగ్గర వాగు పై కల్వర్ట్ నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. గత పాలకులు పొలాలకు నీళ్ళు ఇవ్వకుండా వారి స్వార్థం కోసం సిద్దిపేట, హైదరాబాద్ తరలించారని ఆక్రోశం వ్యక్తం చేశారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మించి రైతుల చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ సీజన్ చివరి దశలో పంట పొలాలకు నీళ్లు అందడం లేదని రైతులు తెలుపగా వెంటనే ఎస్ఆర్ఎస్‌పి అధికారులతో మాట్లాడి నీళ్ల ఇచ్చామని

(మిగతా 8వ పేజీలో)

భూ భారతితో భూ సమస్యల పరిష్కారం




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

రామగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నూతన ఆర్వోఆర్ చట్టం భూభారతితో భూ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం సెంటినరీకాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్, అదనపు కలెక్టర్ వేణులు ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందన్నారు. అధికారులు అందించిన ఆర్డర్ల పై అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, ఆ అవసరం లేకుండా అప్పీల్‌కు అవకాశం కల్పించిందన్నారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్లవచ్చని, అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతీ గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. భూదార్ సంఖ్యతో భూఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా పరిష్కారానికి భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఆర్డీవో సతీష్, తహసీల్దార్ సుమన్, రెవెన్యూ అధికారులు, మండల ప్రజలు పాల్గొన్నారు. అనంతరం కల్వచర్ల, బేగంపేట్, నవాబ్ పేట్ గ్రామాల్లోని ఐకెపి కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు.

రాజాపూర్ సమస్యలపై నిర్వాసితుల ఏకరువు

రాజాపూర్ గ్రామ సింగరేణి నిర్వాసితులు సమస్యలను కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఏకరువు పెట్టారు. గతంలో సింగరేణి స్వాధీనం చేసుకున్న 708.16 గుంటల భూమిని అవార్డు క్యాన్సిల్ చేయడంతో తమకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎలాంటి నోటీసులు, ప్రజాభిప్రాయం సేకరణ లేకుండానే 88 ఎకరాల్లో 24 ఎకరాలు సర్వే చేపట్టిందన్నారు. గ్రామంలోని గృహాలను పూర్తి స్థాయిలో సర్వే చేపట్టిన అనంతరమే భూమి ఇస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే రెవెన్యూ అధికారులు గృహాలు సర్వే చేపట్టారని, మరో సారి సర్వే నిర్వహిస్తామని తొందరపడవద్దన్నారు. సింగరేణి చేపట్టే సర్వేను అడ్డుకోవద్దని సూచించారు. దీని పై గ్రామస్థులు వ్యతిరేకిస్తూ గతంలో ఇదే విధానంతో నష్టపోయామని, సర్వేకు అంగికరించే పరిస్థితి ఉండదని పేర్కొనడంతో కలెక్టర్ వెనుదిరిగారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): భూభారతితో పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారం అవుతాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం నాగారం రైతువేదిక వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూభారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, కమాన్‌పూర్ తహసీల్దార్ వాసంతి, రైతులు, వివిధ వర్గాల ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.



గుర్తింపు పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో మాత్రమే పిల్లలను చేర్పాలని మండల విద్యాశాఖ అధికారి పి.సురేందర్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి మండలంలోని లిటిల్ క్రియేషన్స్, బచ్‌పన్, లక్ష పాఠశాలలకు 2025-26విద్యా సంవత్సరంలోకి అనుమతులు లేవని, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.

చలివేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

కోల్‌సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట, గోదావరిఖని చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను ఆయన ప్రారంభించారు.



పుస్తకం..హస్తభూషణం

నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో అన్నారు పెద్దలు. పుస్తకం మస్తిష్కానికి జ్ఞాన బలం. విజ్ఞానాన్ని పెంచి పుస్తకాలు ప్రగతికి సోపానాలవుతాయి. పుస్తక పఠనంతో అపరమిత విజ్ఞానం సొంతమవుతుంది.


పుస్తక దినోత్సవ నేపథ్యం..

ఏప్రిల్ 23న విలియం షేక్స్పియర్ పుట్టిన, మరణించిన రోజు. మిగ్యుల్ డి సెర్వంటెస్, గార్సిలాసో డి వేగా వంటి ప్రముఖ రచయితలు ఇదే రోజు మరణించారు. వారి తో పాటు ప్రపంచ ప్రఖ్యాత రచయితలకు నివాళులర్పించేందుకు 1995లో పారిస్‌లో జరిగిన యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్‌లో ఏప్రిల్ 23ను ప్రపంచ పుస్తక దినోత్సవంగా ప్రకటించారు. ఇది యునెస్కో ద్వారా ప్రతీ సంవత్సరం నిర్వహించే ప్రపంచ వ్యాప్త కార్యక్రమం.

పుస్తకాల ప్రాధాన్యం

పుస్తక పఠనం ద్వారా కలిగే ఆనందం, సాహిత్య ప్రాధాన్యం, పుస్తకాలపై ఆసక్తి పెంపొందించడం, అంతర్జాతీయ స్థాయిలో రచయితలను గౌరవించడం వంటి అంశాలు ప్రపంచ పుస్తక దినోత్సవ ఉద్దేశాలు.

పుస్తకాలు అన్ని రూపాల్లో నేర్చుకోవడానికి, మనల్ని మనం తెలుసుకునేందుకు తోడ్పడుతాయి. ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు సహకరిస్తాయి. అలరిస్తాయి. దీర్ఘకాలిక అక్షరాస్యత పెరుగుదల, మేధో వృద్ధి, సృజనాత్మకత, శాశ్వతంగా సమాజంలో మార్పు వంటి అంశాల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయి. పాఠకుల్లో పఠన ప్రేమను ప్రేరేపించడంతో పాటు పాఠశాలలు, గ్రంథాలయాలు, ఇతర సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వివిధ పుస్తకాలను అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరం ఉంది. కవులు, రచయితలు, ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించాల్సిన అవసరం ఉంది. పలువురు కవులు, రచయితలు, పుస్తక ప్రియులు తమ వద్ద ఉన్న ఒకే రచయితకు చెందిన రెండుకు పైగా ఉన్న పుస్తకాలు, తాము సేకరించిన పుస్తకాలను ప్రభుత్వ, ప్రైవేట్ గ్రంథాలయాలకు అందించి విజ్ఞాన విస్తృతికి తోడ్పడుతున్నారు. పలు సందర్భాల్లో ప్రదర్శనల్లో వారి వారి పుస్తకాలను ప్రదర్శిస్తున్నారు. ముఖ్య వేడుకల్లో పుస్తకాలను ఉచితంగా బహూకరించి పుస్తకం విలువను చాటి చెబుతున్నారు.



మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌పై కేసు నమోదు

వేములవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు చెన్నమనేని రమేష్‌పై సీఐడీ విభాగం పోలీసులు కేసు నమోదు చేశారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కేంద్ర ప్రభుత్వాన్ని మోసం చేసి భారతదేశ పౌరసత్వాన్ని పొందినట్లు వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని సీఐడీ విభాగం అధికారులు చెన్నమనేని రమేష్‌పై ఐపీసీ 465, 468, 471, సెక్షన్ 12 ఆఫ్ ఇండియన్ పాస్‌పోర్ట్ యాక్ట్ 1967, సెక్షన్ 14 ఆఫ్ ద ఫారినర్స్ యాక్ట్ 1946, సెక్షన్ 17 ఆఫ్ ఇండియన్ సిటిజెన్‌షిప్ యాక్ట్ 1955 ప్రకారం కేసు నమోదు చేశారు. చెన్నమనేని రమేష్ భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ గత డిసెంబర్ నెలలో రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇవ్వడంతో పాటు ప్రతివాది ఆది శ్రీనివాస్‌కు 25 లక్షల రూపాయల పరిహారం, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీకి 5 లక్షల రూపాయల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు సోమవారం చెన్నమనేని రమేష్ న్యాయవాదులు రాష్ట్ర హైకోర్టులో పరిహారం, జరిమానాకు సంబంధించిన సొమ్మును డీడీ రూపంలో చెల్లించారు. ఈక్రమంలో చెన్నమనేని రమేష్‌పై సీఐడి పోలీసులు కేసు నమోదు చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోయినపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం అనంతపల్లి గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. మంగళవారం పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు కనిపించడంతో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ విద్యానగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనం పై అంతస్థు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఎడ్ల వెంకటేశం(50) అనే భవననిర్మాణ కార్మికుడు మృతి చెందాడని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. రామడుగు మండలం షానగర్‌కు చెందిన వెంకటేశం మంగళవారం కరీంనగర్‌లో భవననిర్మాణ పనులకు వచ్చాడని తెలిపారు.

ధాన్యం తరలించాలని రైతుల ఆందోళన



గంభీరావుపేటలో నిరసన తెలుపుతున్న రైతులు



రుద్రంగిలో తడిసిన ధాన్యం

గంభీరావుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం రైతులు ఆందోళన చేపట్టారు. కొనుగోలు సెంటర్లు ప్రారంభించి నెల రోజులు అవుతున్నా తూకం వేసిన వడ్లను తరలించడం లేదని రైతులు ఆరోపించారు. కొనుగోలు సెంటర్ పక్కనే ఉన్న సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రహదారిపై వడ్ల బస్తాలను పెట్టి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్ఐ ప్రేమానందం, ఏఎస్ఐ శ్రీని వాస్‌రెడ్డిలు సిబ్బందితో వచ్చి రైతులను సము దాయించారు. ఫోన్‌లో సంబంధిత అధికారులతో ధాన్యం తరలించేందుకు వాహనాలను పంపించాలని ఎస్ఐ ప్రేమానందం మాట్లాడటంతో రైతులు శాంతించారు.

తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

వీర్నపల్లి : వరిధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తున్నారంటూ మండిపడ్డ వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామరైతులు మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం అరగంట పాటు ఈదురుగాలులతో కురిసిన అకాల వర్షానికి రైతులు విలవిలలాడారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్, సింగిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. మరికొంత మంది రైతుల ధాన్యం వర్షం నీటిలో కొట్టుకుపోవడంతో కన్నీరు మున్నీరయ్యారు. కోతకు వచ్చిన వరి పంటలు రాలిపోయి నీటి పాలయ్యాయి. మ్యాచర్‌కు వచ్చిన ధాన్యం కూడా తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తడిసిన ధాన్యంను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

అకాల వర్షంతో నేలరాలిన మామిడి



వట్టిమల్లలో నేలరాలిన మామిడికాయలు



తిర్మలాపూర్‌లో నేలరాలిన మామిడి కాయలు

కోనరావుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో మామిడి, వరి పంటలు దెబ్బతిన్నాయి. కోనరావుపేట మండలం మట్టిమల్ల, నిమ్మపల్లి, ఎగ్లాస్పూర్ గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో మామిడికాయలు నేలరాలాయి. చేతికొచ్చిన వరి పంటలు దెబ్బతిన్నాయి. నేలరాలిన పంటలను అధికారులతో నష్ట పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కొడిమ్యాల: కొడిమ్యాల మండలం తిర్మలాపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురువడంతో మామిడి కాయలు నేలరాలాయి. పంట చేతికి వచ్చే సమయంలో మామిడి నేల రాలటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నాచుపల్లి, కొడిమ్యాలలో స్వల్పంగా వర్షం కురవటంతో కొంత సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మహిళ మెడలోని గొలుసు చోరీ

కొడిమ్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ గ్రామంలో సోమవారం రాత్రి ఆరుబయట నిద్రిస్తున్న చిన్నవేని నర్సవ్వ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ మంగళవారం తెలిపారు. అదే రోజు మండలంలోని నమిలికొండ గ్రామ పీరీల మజీద్ తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని వెండి వస్తువులను ఎత్తుకుపోయినట్లు ఫిర్యాదు రాగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ ఏజెంట్ల అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఖజకిస్తాన్ పంపిస్తానని మోసం చేసిన నకిలీ ఏజెంట్లు బుర్ర నర్సగౌడ్, నాడెం నర్సయ్యలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంటకు చెందిన రేగుల మోహన్, బోయినిపల్లికి చెందిన పోలే తిరుపతి ఇతర దేశాలకు ఉపాధికోసం పోవడానికి ప్రయత్నిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న నిజామాబాద్ జిల్లా దరిపల్లికి చెందిన నర్సగౌడ్, అతడి స్నేహితుడైన పెద్దపల్లి జిల్లా కుమ్మరికుంట గ్రామానికి చెందిన నాడెం నర్సయ్యలు బాధితుల వద్ద నుంచి రూ.3.55లక్షలు తీసుకొని నకిలీ వీసా, ఫ్లైట్ టికెట్లు ఇచ్చారు. వీటిని తీసుకొని మోహన్, తిరుపతి ఢిల్లీ వెళ్లగా నకిలీవని తేలింది. డబ్బులు ఇవ్వాలని అనేక సార్లు కోరినా తప్పించుకోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇద్దరు నకిలీ ఏజెంట్లను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రాజీవ్ రహదారిపై కారు ఢీకొని యువకుడి మృతి



సంతోష్ (ఫైల్)

తిమ్మాపూర్/కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 22, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో రాజీవ్‌రహదారిపై రోడ్డు పక్కకు ఆగి ఉన్న వ్యక్తిని ప్రమాదవశాత్తూ కారు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన దొప్ప సంతోష్ కుమార్(32) తన డీసీఎం వాహనంలో మక్క కంకులతో మేడ్చల్ జిల్లా నూతనకల్ గ్రామంలో అన్‌లోడ్ చేసి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులో డీసీఎం ఆపి కిందికి దిగాడు. తన స్నేహితు డి కోసం రోడ్డు పక్కన వేచి చూస్తున్న క్రమంలో హైదారాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు అతి వేగంగా, అజాగ్రత్తగా వస్తున్న కారు సంతోష్ కుమార్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో సంతోష్‌కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడే మృతి చెందాడు. మృతుని భార్య దొప్పల స్రవంతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెక్ డ్యామ్‌లో పడి యువకుడి మృతి

వీణవంక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెక్ డ్యామ్‌లో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీణవంక మండల కేంద్రానికి చెందిన దార క్రాంతిరాజ్ (19) అనే యువకుడు సోమవారం సాయంత్రం కాలకృత్యాలు తీసుకోవడానికి చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లాడు. రాత్రి అయిన కూడా క్రాంతిరాజ్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామంలోని చుట్టూ పక్కల వెతికారు. చెక్ డ్యామ్ నీటిలో ఓ బాలుడు తెలుతు కనబడగా సదరు వ్యక్తులు ఒడ్డుకు తీసుకురాగా క్రాంతిరాజ్‌గా గుర్తించారు. ప్రమాదవశాత్తు కాలు జారి, ఈత రాకపోవడంతో నీటిని మునిగి మృతి చెందినట్లు నిర్ధారించారు. మంగళవారం మృతుడి తల్లి దార స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

వడదెబ్బతో చిరువ్యాపారి మృతి



భూమయ్య (ఫైల్)

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన పాత భూమయ్య(55) అనే చిరువ్యాపారి వడదెబ్బతో మంగళవారం మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భూమయ్య ఇంటింటికీ తిరుగుతూ చింతగింజలను కొనుగోలు చేస్తుంటాడు. ఎప్పటి మాదిరిగానే సైకిల్‌పై 5 కిలోమీటర్ల దూరంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి వెళ్లి ఇంటింటికి తిరుగుతుండగా ఒక్కసారి కిందపడిపోయాడు. గ్రామస్థులు 108 వాహనంలో సిరిసిల్ల ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. భూమయ్యకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య



గంగమ్మ(ఫైల్)

బుగ్గారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన కట్ట గంగమ్మ (61) గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు కొంతకాలంగా టీబీతో గంగమ్మ బాధపడుతోంది. దీంతో జీవితం మీద విరక్తి చెంది మంగళవారం ఉదయం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కొడుకు కట్ట తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



రాకేష్ (ఫైల్)

బోయినపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు తన ప్రైవేట్ ఫొటోస్ ఫ్రెండ్స్ బయట పెడతారేమోనని భయాందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది గ్రామానికి చెందిన సుందరగిరి రాకేష్ (24) కరీంనగర్ పట్టణంలో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గత శుక్రవారం రాకేష్ ఇంటికి వచ్చి ఉదయం పూట బయటకు వెళ్లాడు కుటుంబ సభ్యులు రాకేష్ ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. అయితే రాకేష్ గ్రామ శివారులో మృతి చెంది మంగళవారం కనిపించడంతో పోలీసుల కు సమాచారం అందించారు. అంతకు ముందు కొద్దిరోజులుగా రాకేష్ ప్రవర్తనలో మార్పు ఉండడంతో తండ్రి మల్లేశం అడగా తన వ్యక్తిగత ప్రైవేట్ ఫొటోలు స్నేహితుల వద్ద ఉన్నాయని అవి బయటకు వస్తాయేమోనని, ఇంకేమైనా కారణం ఉందేమోనని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుకున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విట్టంపేట గ్రామ శివారులోని వరద కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పొలాలకు వెళ్తున్న రైతులు వరద కాలువలో మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహం ఎడమ చేతిపై త్రిశూలం గల పచ్చబొట్టు ఉన్నదని ఎవరికైనా తెలిస్తే 8712656794 ఫోన్‌నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఆకునూరి రాజేశ్వరి(49) అనే వివాహిత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. రాజేశ్వరి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆయాగా పని చేస్తుంది. ఈ నెల 18న కుటుంబ సమస్యలతో క్షణికావేశంలో రాజేశ్వరి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసుపత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త రవికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

● టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్ బాబు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్‌శాఖ ఉద్యోగులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం ఎస్ఈ ఆఫీసులో మంగళవారం ఏర్పాటుచేసిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, మేక రమేష్ బాబు తెలిపారు. ఈ ఫోన్ ఇన్ కార్యక్రమం మధ్యాహ్నం 12గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇందులో ఫోన్ కాల్స్ సమస్యలు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కరీంనగర్ టౌన్ డివిజన్, కరీంనగర్ రూరల్ డివిజన్, హుజురాబాద్ డివిజన్ లో మొత్తం కలిపి 24 ఫోన్ కాల్స్ వచ్చినాయి అన్నారు. ఈ సమస్యలను సత్వరమే పరిష్కారం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీ ఈ లు కే ఉపేందర్, జె రాజాం, ఎం తిరుపతి, ఎస్ఏఓ, రాజేందర్ ప్రసాద్,ఏడీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు



టైల్స్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం అన్నారు. మంగళవారం చైర్మన్ మల్లేశంతో కలసి అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో సుడా నిధులతో టైల్స్ ఎలా వేశారో పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండాలని డీఈని ఆదేశించారు. పాఠకులు, విద్యార్థులతో ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కుర్చీలు కొన్ని అవసరమని వారు కోరగా కొత్త కుర్చీలను చైర్మన్ తెప్పించారని సిబ్బంది తెలిపారు. బాలల గ్రంథాలయాన్ని కూడా సందర్శించి బాలలతో ముచ్చటించారు. బాగా చదువుకొని సమాజోపయోగకర వ్యక్తులుగా శక్తులుగా ఎదగాలని పేర్కొన్నారు

కిరాణాషాపులో చోరీ

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ భగత్‌నగర్‌లో సోమవారం అర్ధరాత్రి ఒక కిరాణంషాపులో గుర్తుతెలియని దొంగలు చొరబడి నగదును ఎత్తుకుపోయారు. కిరాణంషాపు షెట్టర్ తెరచిన దొంగలు కౌంటర్‌లోని 3,700 రూపాయల నగదుతో పాటు కొన్ని వస్తువులను ఎత్తుకుపోయారు. ఈ మేరకు బాధితుడు బచ్చు దామోదర్ రెండో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

జగిత్యాలరూరల్, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన అబ్బల్‌బీకి చెందిన ఇల్లు మంగళవారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అబ్బల్ బీ ఇద్దరు కుమారులు విదేశాల్లో ఉంటున్నారు. ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌కు షార్ట్‌సర్క్యూట్ సంభవించి మంటలు అంటుకున్నాయి. స్థానికులు ఫైర్‌ఇంజిన్‌కు సమాచారం అందించి సిబ్బంది సహాయంతో మంటలు ఆర్పివేశారు. సుమారు 3.5 లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

అంత్యక్రియల్లో శునకం

మృతుల బంధువులతో కలిసి స్నానం



కర్మకాండల కోసం వెళ్తున్న వారి వెంట శునకం

జగిత్యాలరూరల్, ఏప్రిల్22 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఓ శునకం గ్రామం లో కొన్ని నెలలుగా ఎవరు చనిపోయినా అంత్యక్రియల్లో పాల్గొంటోంది. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం గ్రామ శివారులో గల చెరువులో స్నానం చేస్తోం ది. కర్మకాండలు నిర్వహించే సమయం లోను శ్మశానం వరకు వెళ్లి కార్యక్రమాలు పూర్తయ్యేవరకు అక్కడే ఉండి మృతుల కుటుంబసభ్యులతో ఇంటివరకు వెళ్తుంది. కొన్ని నెలలుగా శునకం తీరును గమనించిన పలువురు సోషల్‌మీడియాలో వైరల్ చేశారు.



చెరువులో స్నానం చేస్తున్న శునకం

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన యువకుడు గడ్డి నరేందర్(24) ఈ నెల 21న రాత్రి మండల కేంద్రంలో ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. తన కొడుకు మరణానికి కారణమైన మహిళపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి గడ్డి లక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హత్యాయత్నం కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో హత్య చేయడానికి యత్నించిన యువకుడిపై గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జనగామ గ్రామానికి చెందిన ఓ యువతితో గోదావరిఖనికి చెందిన రాకేష్‌కు కొంతకాలంగా సాన్నిహిత్యం ఉన్నది. ఈక్రమంలో తన స్నేహితుడైన రాజును సదరు యువతికి పరిచయం చేశాడు. యువతి రాజుతో తరచూ ఫోన్ మాట్లాడం గమనించిన రాకేష్ జీర్ణించుకోలేకపోయాడు. తనను కాదని రాజుతో మాట్లాడుతుండడంతో రాజుని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 20న జనగామ శివారుకు రావాలని యువతి మొబైల్ నుంచి రాకేష్ రాజుకు మెసేజ్ పంపాడు. యువతి పిలిచిందని నమ్మిన రాజు గ్రామ శివారుకు వెళ్ళాడు. అక్కడ వేచి చూస్తున్న రాకేష్ రాజుపై వెంట తెచ్చుకున్న కత్తితో దాడిచేసి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడ్డ రాజును కరీంనగర్ తరలించారు. బాధితుడి మామ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాకేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

ఇంటర్ ఫలితాల్లో అల్ఫోర్స్ జయకేతనం



విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్ అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ద్వితీయ సంవ త్సరం బైపీసీలో జె.అంజన 1000 మార్కులకు 997 మార్కులతో రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచింది. ఎంపీసీ లో కె.రుత్విక్ 996 మార్కులు సాధించాడు. పి.శ్రీనిత్య రెడ్డి 995, ఎం.రుత్విక 995, ఎ.లక్ష్మీప్రసన్న 995, ఎస్. సేవిత 994, వి.రుషి కేష్ 994, వి.సాహితి 994, ఎస్. కార్తికేయ 994, జి.లక్ష్మీప్రసన్న 994, ఎస్. కీర్తి 994, ఎస్.అక్షత 994, వి.సాహితి 994, కె.వర్షిణి 994, ఎం.కీర్తి 994 మార్కులు సాధించారు. 990 ఆపై మార్కులు సాధించినవారు 128 మంది, 900 మార్కులు ఆపై మార్కులు 2293 మంది ఉన్నారు. ఎంఈసీలో వి.అక్షయ్‌వర్ధన్ 988, వి.రిషిత 988, సీఈసీలో బి.గ్రీష్మా 987, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో 470 మార్కులకు ఎస్. లహరి 468, హప్సహస్నాన్ 468, తహారానూర్ 468, టి. అన్వితరెడ్డి 468, సీహెచ్ అమతౌరాజ్ 468, పి.కీర్తిశ్రీ 468, జె.ప్రసూనాశ్రీ 468, ఎన్.కృష్ణవేణి 468, జి.తరుణ్ 468, డి.నాగాసాగర్ 468, జె. ప్రణవ్ తేజ 468, ఎ.శశి వర్ధన్‌రెడ్డి 468, ఎల్.హాసిని 468, ఎం. శ్వేత 468, కె.పల్లవి 468, కె.అనుపమ 468, ఎ.నిచిత 468, జి.తరుణ్ 468, జి.లక్ష్మీప్రియ 468, మొత్తం 20 మంది విద్యార్థులు 468 మార్కులు సాధించారు. 66 మంది 467 మార్కులు సాధించారు. బైపీసీలో 440 మార్కులకు నభిలా తరీమ్ 438, సామాపి రదోష్ 438, 10 మంది విద్యార్థులు 437 ఆపై మార్కులు సాధించారు. ఎంఈసీలో 500 మార్కులకు ఆర్. చిద్విలాప 491 మార్కులు, సీఈసీలో 500 మార్కులకు పి.భవజ్ఞ 493 సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అల్ఫోర్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ మెయిన్స్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుతంగా రాణించారని, రాబోయే నీట్, ఎంసెట్ ఫలితాల్లోనూ విజయం సాధిస్తారని అన్నారు.

డాక్టర్ అవుతా: అంజన, 997 మార్కులు



డాక్టర్ కావాలనేది నా లక్ష్యం. అందుకోసం చాలా కష్టపడి చదువుతున్నా. ముఖ్యంగా మా లెక్చరర్లు చాలా బాగా పాఠాలు చెప్పారు. ఎలా చదవాలనే విధా నాన్ని నేర్పారు. అది నాకు ఎంతగానో ఉపయోగపడింది.

సివిల్స్ కొట్టాలనేది కల: కే.రుత్విక్, 996 మార్కులు



సివిల్స్ సాధించాలనేది నా కల. అందుకుతగ్గట్టుగా నేను చదువుతున్నా. మా కాలేజీ లెక్చరర్లు చాలా బాగా చదువు చెబుతున్నారు. వారు సూచించిన విధంగా చదివి ఇన్ని మార్కులు సాధించాను.

ట్రినిటి విద్యార్థుల విజయఢంకా



విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ట్రినిటి కళాశాలల విద్యార్థులు విజయఢంకా మోగించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు జి.మధురిమ 468, డి. సిరివైష్ణవ్య, ఆర్.ఉమాదేవి, వికాశసాహి, కె.శశాంక్, ఎ.లహరిక, ఈ. అనూష, బి.వైష్ణవి, వి.అర్చన, మేకల వైష్ణవి, ఎ.హారిక, కె.శ్రీవర్ష, ఎస్. శ్రీజ, పి.రిషిక, జె.శరణ్య, ఫబిలైనాయత్, ఎం. రక్షిత, జి.నేహా, పి. నిఖిత మొత్తం 18 మంది విద్యార్థులు 467 మార్కులు, 48 మంది విద్యార్థులు 466 ఆపైన, 67 మంది విద్యార్థులు 465 మార్కులు సాధించారు. బైపీసీలో పి.సహస్ర, ఎల్. హేమ నందిని 440 మార్కులకు 438 సాధించారు. జె.సౌమ్య, కె.విజయలక్ష్మి, సీహెచ్ హాసిని 437 మార్కులు సాధించగా, 16 మంది విద్యార్థులు 436 మార్కులు, 21 మంది విద్యార్థులు 435 మార్కులు, సీఈసీ విభాగంలో వై.వైష్ణవి 494, డి.రాహుల్ 490 మార్కులు, ఆర్‌పీ దీపిక 490, ఎంఈసీలో భువనవిజయ్ 479, ఎ.శ్రావణి 467 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో 1000 మార్కులకు వి.రక్షిత 995, జి.అజయ్, బి.హితేష్, సీహెచ్ బాలాజి, ఎం.సంధ్య, కె.ప్రణతి, కె.సాయిసంహిత 994, 13 మంది విద్యార్థులు 993 మార్కులు, 21 మంది విద్యార్థులు 992 మార్కులు ఆపైన, 27 మంది విద్యార్థులు 991 మార్కులు ఆపైన, 30 మంది విద్యార్థులు 990 మార్కులు ఆపైనా సాధించారు. బైపీసీలో డి.జ్యోత్స్నశ్రీ 996, వి.మహతి, కె .పల్లవి 994 మార్కులు సాధించారు. నలుగురు 993 మార్కులు ఆపైన, ఏడుగురు విద్యార్థులు 992 మార్కులు ఆపైన, 12 మంది విద్యార్థులు 991 మార్కులు ఆపైన, 16 మంది విద్యార్థులు 990 మార్కులు సాధించారు. సీఈసీలో ఎ.శృతి 981 మార్కులు, ఎంఈసీలో రిశకశర్మ 980 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఫౌండేషన్ మెరుగుపరుస్తూ, కచ్చితమైన ప్రణాళికతో అనుకున్న సమయంలో సిలబస్‌ను పూర్తి చేశామన్నారు.

డాక్టర్‌ను అవుతా :జ్యోత్స్నశ్రీ, 996 మార్కులు



డాక్టర్ కావాలన్నది నాకల. అందుకోసం నేను ఇప్పటినుంచే ఎంతో కష్టపడి చదువుతున్నా. లెక్చరర్లు, నా కుటుంబసభ్యులు ప్రోత్సహిస్తున్నారు. ఇంటర్‌లో ప్రణాళికతో చదివాను.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా: వి.రక్షిత, 995 మార్కులు



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనుకున్నాను. దానికి కావాల్సిన విధంగా చాలా కష్టపడి చదువుతున్నా. మా లెక్చరర్లు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంది.

శ్రీచైతన్య విద్యాసంస్థల విజయభేరి



విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్ శ్రీచైతన్య విద్యార్థులు విజయభేరి మోగించారు. మంగళవారం ఫలితాలు వెలువడిన సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్‌రెడ్డి విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ జూనియర్ కళాశాలలు స్థాపించిన నాటి నుంచి రాష్ట్ర స్థాయి ర్యాంకులకు కేరాఫ్‌గా నిలవడం సంతోషంగా ఉందన్నారు.

ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో 1000 మార్కులకు ఆర్.వైష్ణవి 993, ఎ.లాస్వికా 992, జి. శ్రీనిత్య 991, పి.భరత్ రెడ్డి 991, ఇ.అకిరానందన్ 991, బైపీసీలో ఎ.అభ్యుదయ 994, ఎన్.భార్గవి 992, పి.స్ఫూర్తిశ్రీ 990, బి.రోహిత్ 990, సీఈసీలో ఎ.మధు మిత 961, ఎంఈసీలో మెరుగు భాను ప్రకాశ్ 951. మొదటి సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో ఎ. లక్ష్మీహాసిని 468, జి.శ్రీహిత 467, పి.హాసిని రావు 467, ఎం. సాత్విక 467, జి.శ్రీనిధి 467, కె.మైత్రి 467, 22 విద్యార్థులు 466, 14 మంది విద్యార్థులు 465, బైపీసీలో ఈ.అఖిల 437, ఔష సినివాసన్ 437, ఎస్. విష్ణు 436, వి.లహరి 436, ఆర్.అక్షయశ్రీ 436, సీహెచ్. కార్తిక్ 436, 430పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 13 మంది, ఎంఈసీ విభాగంలో ఎల్.కమలేశ్ కుమార్ 474, సూర మనీష 470. సీఈసీ విభాగంలో టి. హరిణి 492, కె.అంజలి 491 మార్కులు సాధించినట్లు వివరించారు. కార్యక్ర మంలో శ్రీచైతన్య డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి,డీన్ జగన్ మోహన్ రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు మల్లారెడ్డి, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్‌లో కోటా ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న కోటా రెసోనెన్స్ చైర్మన్ డాక్టర్ అంజిరెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌ఫలితాల్లో కోటా ఇన్స్టిట్యూట్ రెసోనెన్స్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ డాక్టర్ అంజిరెడ్డి తెలిపారు. కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అతి తక్కువ మంది విద్యార్థులతో రాష్ట్రస్థాయి మార్కులు సాధించినట్లు, 92 శాతంతో జిల్లాలోనే అత్యధిక పాస్ పర్సెంటేజీ సాధించి చరిత్ర సృష్టించినట్లు చెప్పారు. ఇంటర్ జూనియర్ ఎంపీసీలో టి.బావన, జి.సాయి, అక్షిత, సహన, అహన్య, శ్రీఅక్షిత, పి.సంజన 467 మార్కులు, కె.కీర్తన, ఎం. అక్షయ, కె.అక్షయ్ వర్ధన్, బి.సహస్రశ్రీ, టి.విజయ్ వర్ధన్, ఎం. నిత్యరెడ్డి, కె.సాత్విక్, సీహెచ్ హస్యచరెడ్డి 466 మార్కులు సాధించారని, 465 మార్కులు ఏడుగురు, 464 మార్కులు పది మంది, 460 పైగా మార్కులు పది మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. జూనియర్ బైపీసీలో ఎం.శ్రీష 436 మార్కులు, బి.సాయి త్రిపుర 435, వై.వంశిక, ఎ.సంజనా నాయక్, ఎం.తేజస్వీ 432 మార్కులతోపాటు ఎనిమిది మంది విద్యార్థులు 430కి పైగా మార్కులు సాధిచారన్నారు. సీనియర్ ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ఎం.శ్రీనిత, ఎస్.శృతి 987 మార్కులు, ఆరుగురు విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించినట్లు చెప్పారు.

యాదవులను బీసీ ఏలోకి మార్చాలి..

జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్ యాదవ్..

గంభీరావుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : యాదవులను కేటగిరి బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్‌యాదవ్ పేర్కొన్నారు. గంభీరావుపేట మండల ముస్తాఫనగర్‌కు చెందిన కొక్కు దేవేందర్ యాదవ్ జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మంగళవారం తన నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని యాదవ సంఘం నాయకులు పెద్దఎత్తున వచ్చి దేవేందర్‌యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 16 శాతం ఉన్న యాదవులకు యాదవ కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్లను నియమించి, ప్రతి బడ్జెట్‌లో 5వేల కోట్లు కేటాయించాలన్నారు. గొర్ల, మేకల రాష్ట్ర ఫెడరేషన్‌కు కూడా చైర్మన్, డైరెక్టర్లను నియమించాలన్నారు. యాదవులకు మంత్రి పదవి, మూడు ఎమ్మెల్సీ పదవులు ఇవ్వాలన్నారు. కోకాపేటలోని యాదవ భవన్‌ను వెంటనే ప్రారంభించాలన్నారు. గొర్ల కాపర్లకు జీవో నం.559, 1016 ప్రకారం ప్రతి గ్రామంలో 5 నుంచి 10 ఎకరాల బంజరు భూమి కేటాయించాలన్నారు. రాష్ట్ర పాల డెయిరీ చైర్మన్, డైరెక్టర్లుగా యాదవులనే నియమించాలన్నారు. 50 ఏళ్ల దాటిన గొర్ల కాపర్లకు ప్రతినెలా రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు చెవుల మల్లేశం, అగ్గతి రాజు, శ్రావణ్ కుమార్, కృష్ణకాంత్ యాదవ్, వెంకట్‌యాదవ్, మహేష్‌యాదవ్, బొంగు మల్లేశం యాదవ్, దేవేందర్ యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, గొడుగు దేవయ్య, రవి యాదవ్, నాగరాజు,రాజు, మల్లేశం, అన్వేష్, కృష్ణమూర్తి ఉన్నారు.



దేవేందర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

కొండగట్టులో భక్తుల రద్దీ



చలువ పందిళ్ల కింద సేదతీరుతున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. కాగ హనుమాన్ చిన్న జయంతి సమీపిస్తుండడంతో వేలాదిగా సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న అంజన్న దీక్షపరులు వేకువజామునే స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. దాదాపుగ ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.



కొండగట్టు ఆలయ ఆవరణలో భక్తుల సందడి

కొండగట్టులో పార్కింగ్ స్థలాల ఏర్పాటు

● ఆలయం వరకు వాహనాల్లో రావద్దు ● ఈవో శ్రీకాంత్‌రావు

మల్యాల: కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల కోసం కొండపైన రెండు చోట్ల పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు ఈవో శ్రీకాంత్ రావు తెలిపారు. వచ్చె నెలలో జరిగే పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల కోసం, విద్యాసంస్థలకు వేసవి సెలవుల నేపథ్యంలో ఇటీవల భక్తుల రద్దీ పెరగడంతో కొండపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. వాహనాలను పోలీస్ చెక్‌పోస్టు ముందు గల పార్కింగ్ స్థలంతో పాటు వైజంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్‌లోనే నిలపాలని ఈవో కోరారు. భక్తులకు అసౌకర్యంగా మారిన దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగుల వాహనాలకు మినహాయింపు ఉంటుందని భక్తులు సహకరించాలని ఈవో కోరారు.

పదేళ్ల వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్‌లో చేరిక

జగిత్యాల ఎమ్మెల్యేపై మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శ

జగిత్యాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్‌లో ఉండి వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు కాంగ్రెస్ ముసుగులో చేరి అభివృద్ధి చేస్తానంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో జైబాపు..జై బీమ్..జై సంవిధాన్ కార్యక్రమంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.



జగిత్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు

పట్టణంలోని గాంధీనగర్ నుంచి మంచినీళ్ల బావి వరకు రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. గాంధీనగర్‌లో గల అంబేద్కర్, మహాత్మ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దకాలం బీఆర్ఎస్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడి కాంగ్రెస్ కార్యకర్తలు సాధించుకున్నదే ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వమన్నారు. అభివృద్ధి మాకు చేత కాదా అని, మాకంటే ఎక్కువ అనుభవం ఉందా నీకు అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి జీవన్ రెడ్డి ప్రశ్నించారు. స్వార్థ ప్రయోజనాలే అభివృద్ధి అని చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. గతంలో తాను రాష్ట్ర స్థాయిలో పోటీ పడి జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని చెప్పారు. దశాబ్దకాలం బీఆర్ఎస్ పాలనలో పద వులు అనుభవించి, స్వార్థ ప్రయోజనాల కోసం అభివృద్ధి ముసుగు వేసుకొని కాంగ్రెస్ కార్యకర్తల కాళ్లలో కట్టెలు పెడుతున్నారని జీవన్‌రెడ్డి ఆరోపించారు.

రాహుల్‌గాంధీ ఆలోచన విధానాలను అమలు చేయాలని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జేఎన్‌టీయూ కళాశాల, వ్యవసాయ కళాశాల, నాక్ శిక్షణ కేంద్రం, 25 ఎకరాల్లో మామిడి మార్కెట్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. పేదల సంక్షేమానికి ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో జగిత్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి జీవన్ రెడ్డి, నాయకులు గుంటి జగదీశ్వర్, అల్లాల సరిత రమేశ్, నక్క జీవన్, గిరిధర్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పిప్పరి అనిత, అనుమల్ల జయశ్రీ, రేణుక మొగిలి, పద్మ సంగరావు, పద్మ రాజేందర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌యూలో బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు సెమిస్టర్ ఫీజు షెడ్యూల్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ కోర్సులో రెండో సెమిస్టరు, నాలుగో సెమిస్టర్, ఆరో సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణ ఆదికారి డాక్టర్. సురేష్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. వచ్చే నెలలో పరీక్షలు ఉంటాయని, అపరాధ రుసుము లేకుండా ఈ నెల 28 వరకు చెల్లించాలని పేర్కొన్నారు. రూ.300 అపరాధరుసుముతో వచ్చే నెల 5వ తేదీలోగా ఆన్‌లైన్ పద్ధతిన చెల్లించాలని సూచించారు. 2018-19 సంవత్సరం కోర్సులో ప్రవేశం పొందిన బ్యాక్‌లాగ్ విద్యార్థులకు కూడా వన్‌టైం చాన్స్ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

'ఉపాధి హామీ పనిదినాలు తగ్గించొద్దు'

భగత్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనిదినాలు తగ్గించొద్దని టీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి హామీ పని దినాల్లో కోత విధించే కుట్రలను ఆపాలని, లేకపోతే కూలీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తోందన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీలకు 700 రూపాయలు వేతనం ఇవ్వాలన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న 26 వేల కోట్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఖనిలో వైభవంగా రేణుక ఎల్లమ్మ బోనాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, బోనాలతో ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థులకు అండగా ఉంటానని, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రేణుక ఎల్లమ్మ ఆలయం నిర్మించడం హర్షనీయమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం రాత్రి రేణుక ఎల్లమ్మ బోనాల సందర్భంగా గోదావరి ఖని చౌరస్తాలో మక్కాన్‌సింగ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాం చందర్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం లోని పెద్ద ఎత్తున మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వచ్చారు.



బోనాలతో భారీగా తరలి వచ్చిన మహిళలు

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 14మందికి నలుగురు, రెండో సంవత్సరంలో 50మందికి 19మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరంలో 80మందికి 22మంది, రెండో సంవత్సరంలో 68 మందికి 47మంది ఉత్తీర్ణులయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. మోడల్ స్కూల్‌లో ఎంపీసీలో ఓల్లాల రాజశ్రీకి 910మార్కులు, ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ముత్యాల సంకీర్తన 470కి 344, బైపీసీలో గాజుల ప్రణవికి 440కి 364మార్కులు వచ్చాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బి.అక్షితకు ద్వితీయ సంవత్సరం ఎంపీసీ 966 మార్కులు సాధించింది. కస్తూర్బా బాలికల పాఠశాలలో 70మందికి 57మంది ఉత్తీర్ణులయ్యారు.

991 మార్కులు సాధించిన నల్ల హర్షిత



రామగిరి, (ఆంధ్రజ్యోతి): పన్నూరు గ్రామంలోని నల్లశ్రీనివాస్- రజిత కూతురు నల్లహర్షితకు బైపీసీలో 991 మార్కులు సాధించింది. రాఘవపూర్‌లో కొనసాగుతున్న మంథని ప్రభుత్వ ఉర్దూ కళాశాలలో చదువుతోంది. ప్రస్తుతం ఎంబీబీఎస్‌లో సీటు సాధించేందుకు నీట్ పరీక్షకు కరీంనగర్‌లో కోచింగ్ తీసుకుంటుంది. విద్యార్థి అత్యుత్తమ ఫలితం సాధించడంపై జిల్లా పద్మశాలి ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శి కొలిపాక సారయ్య, కోటేశం అభినందించారు.

మంథనిలో...



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సలీం

మంథని, (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో మంథని ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు 465 మార్కులు సాధించిన గుండోజు శ్రీజ ప్రభుత్వ కళాశాలల విభాగంలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ సలీం తెలిపారు. హరికశ్రీ 453, పెంద్యాల శ్రీనిధి, సిరిచందనలు 449, అక్షయమహాలక్ష్మి 434, పాత హర్షిత 431, బైపీసీలో సుదేష్ణ 394, ద్వితీయ సంవత్సరంలో సీఈసీలో కొడేల అపర్ణ 903, ఎంపీసీలో శ్రీజ 886, బైపీసీలో హరిణి 837 మార్కులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సలీం అభినందించారు.

ముత్తారంలో...



ఆర్.స్పందన జి. అశ్విత

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): దర్యాపూర్ శివారు ఆదర్శ పాఠశాల విద్యార్థుల హవానే ఉంది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఆర్.స్పందన ఎంపీసీ విద్యార్థి 470 మార్కులకు 460 సాధించారు. 80 మంది విద్యార్థులకు 55 మంది ఉత్తీర్ణులుకాగా 68.7శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరం జి.అశ్విత ఎంపీసీ 1000 మార్కులకు 960 సాధించారు. 87 మంది విద్యార్థులకు 76 మంది ఉత్తీర్ణతతో 87.3శాతం సాధించారు. కస్తూర్బా పాఠశాలకు చెందిన ఎంపిహెచ్‌డబ్ల్యు విద్యార్థి ఐలి అమూల్య 962 మార్కులు సాధించారు. ద్వితీయలో 98.0 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 470 మార్కులకు చాగర్ల శివకుమార్ 428 సాధించారు 69.38 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయలో గడ్డం సాయిప్రియ 912 మార్కులు సాధించి 67.0శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

సుల్తానాబాద్ లో ..

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): గర్రెపల్లి మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 96శాతం ఉత్తీర్ణత సాధించారు ఎన్. స్వప్న ఎంపీసీ 987-1000, ఎన్. అక్షిత బైపిసి 953, యూ. శ్రేయ సీఈసీ 947 సాధించారు. మొదటి సంవత్సరంలో అక్షిత ఎంపీసీ 461-470, శిరిష 434-440, సునిత 479-500 సాధించగా ప్రిన్సిపాల్ గోల్డీబల్బీర్ కౌర్ అభినందనలు తెలిపారు.

సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు 71 మంది ఉత్తీర్ణత సాధించారు. సీఈసీ ద్వితీయలో సంజన 975, సుష్మ 956, సిహెచ్ మైథిలి వర్ష 956, హెచ్ఈసీలో జి సుహాసిని 966, జి తేజస్విని 816, సీఈసీ ఫస్ట్ ఇయర్‌లో కీర్తన 486, గాయత్రి 471, హెచ్ఈసీలో శ్రీవాణి 469, అక్షిత 454 సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ గిరిజ, సీనియర్ లెక్చరర్ అశోక్ రెడ్డి, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ట్రినిటి విద్యార్థుల విజయభేరి



సాయి సమిత ఇరాం నాజ్ తీగల రవళి జయంతి రోషిణి పోతని కీర్తన కందునూరి శ్రీలక్ష్మి అల్లి శృతి



మేకల వైష్ణవి షణ్ముఖ ప్రియ దిడ్డి వైష్ణవి పోగుల తన్విత

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మీడియెట్ పరీక్షల ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పెద్దపల్లి ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. సెకండ్‌ఇయర్ ఎంపీసీలో 1000 మార్కులకుగాను కారెంగుల సాయి సమిత 994, ఇరాం నాజ్ 994, తీగల రవళి 992, రాధారపు అరుణ్ కుమార్ 991, శ్రీరాముల మేఘన 990, గంగుల హర్షిణి 989, రంగిశెట్టి అశ్రిత 988, దేవనంది సాహితి 987, కొప్పుల విష్ణుప్రియ 985 అత్యధిక మార్కులు సాధించారు. బైపీసీలో 1000 మార్కులకు జయంతి రోషిణి 984 మార్కులు, పోతని కీర్తన 982, కందునూరి శ్రీలక్ష్మి 980, మల్లెత్తుల అశ్విత 977, అల్మాజ్ అంజుమ్ 974, అరాఫత్ నదీరా 968, తోట రుచిత 963, చల్లపల్లి అనుబ్లెస్సీ 958 మార్కులు సాధించారు. సీఈసీలో 1000 మార్కులకు అల్లి శృతి 981 మార్కులు, ఏక్తా జైన్ 969, నేదునూరి సిరి 956, రమావత్ మహిమ 935 అత్యధికంగా మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను మేకల వైష్ణవి 467 మార్కులు, రంగు షణ్ముఖ ప్రియ 466, దిడ్డి వైష్ణవి 466, బూర్ల శిరీష 466, ఎర్రోజు శ్రీహిత 466, తాళ్లపల్లి హర్షిత 465, ఎల్లంకి సుశ్రిత 465, తోట నాగశయన్ 464, రింషా మహేక్ 464, బెజ్జంకి సంతోషిణి 464 ,కొలిపాక వర్షిత 464, గుంజపడుగు రమ్య 464 అత్యధిక మార్కులు సాధించారు. బైపీసీలో 460 మార్కులకు గాను పోగుల తన్విత 434 మార్కులు, తోట నిశిధ 432, అఫ్రియా 429, ఎండీ ముజాహిద్ ఖాన్ 427, సీఈసీలో 500 మార్కులకు గాను యదవనేవి కావ్య 444 మార్కులు సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, కళాశాల వ్యవస్థాపకులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నవీన్, ఓదెలు అభినందించారు.

ఓదెలలో

ఓదెల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల, మోడల్ కళాశాల, విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభను కనబరిచారు. అలాగే కేజీబీవీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 32 మందిలో 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగ 96.8 శాతం ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ లో బి. నవ్య ఎంపీసీలో 426 మార్కులు, టి.హాసిని బైపిసిలో 440 కి గాను 420 మార్కులు సాధించింది. అలాగే యు. ఐశ్వర్య సెకండ్ ఇయర్ లో ఎంపీసీలో వెయ్యి మార్కులకు గాను 680 మార్కులు, బైపిసి లో అక్షయ వెయ్యికి గాను 680 మార్కులు సాధించారు. జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 81 మంది ఉండగా ఇందులో 57 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జి.అక్షితకు ఎంపీసీలో 356 మార్కులు, మంద సాహితి బైపిసి లో 415 మార్కులు అలాగే సెకండ్ ఇయర్లో బూర్ల రజిని బైపిసి 941 మార్కులు, ఇ.మనోజ్ ఎంపీసీ లో 768 మార్కులు సాధించారు. అలాగే మోడల్ కళాశాలలో ఎంపీసీలో పి.తిరుమల్ రెడ్డి వెయ్యి మార్కులకు గాను 768 మార్కులు సాధించారు. అంజలి బైపిసి లో 941 మార్కులు సాధించారు.

సచ్‌దేవ విద్యార్థుల ప్రతిభ



మధుమిత రిజా మెహ్రోష్ ప్రసాద్ రియా ఆర్.సహిష్ణారెడ్డి బి.అక్షర

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీలోని సచ్‌దేవ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఆర్.మధుమితకు ఎంపీసీలో 463/470 మార్కులు, ద్వితీయ బైపీసీ విద్యార్థిని రిజా మెహ్రోష్ 963/1000 మార్కులు, సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థిని ప్రసాద్ రియా 453/500 మార్కులు, ద్వితీయ సీఈసీలో ఆర్.సహిష్ణారెడ్డి 915/1000 మార్కులు, మొదటి సంవత్సరం ఎంపీసీలో బి.అక్షర 462/470 మార్కులు సాధించారు. విద్యార్థులను సచ్‌దేవ జూనియర్ కలాశాల ప్రిన్సిపాల్ జ్ఞానచంద్ అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో ఖని విద్యార్థుల హవా



జి.హాసిని అమృతవర్షిణి కె.సాహితి రిత్విక యశ్వంత్ ఆర్.అక్షయ దీక్షిత్ స్ఫూర్తి హాసిని

కోల్‌సిటీ టౌన్, (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో గోదావరిఖనికి చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు.

కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో... ఎంపీసీ ద్వితీయలో ఎస్.రిత్విక, ఓ.యశ్వంత్ 988, బైపీసీలో ఎం.దీక్షిత్‌గౌడ్ 957, జవేరియా ముస్కాన్ 933, సీఈసీలో ఆర్.అక్షయ 936, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో టీ.శశాంక్ 465, సీహెచ్.సాత్విక 461, హుజాయిఫా 461, బి.శ్రీనిహారిక 460, బైపీసీలో ఎం.సాత్విక 425, సీఈసీలో ముస్కాన్ అంజుమ్ 485, పి.సింధూజ 483, ఆర్.భవ్య 482 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ నాగండ్ల జమున రవికుమార్‌అభినందించారు.

కాకతీయ జూనియర్ కళాశాలలో...ఎంపీసీ ద్వితీయలో గడ్డం హాసిని, జి.అమృతవర్షిణి 991 మార్కులు, బైపీసీలో హాఫ్సా యామిన్ 992, సీఈసిలో కె.సాహితీ 982, ఎం.స్పందన 982, ప్రథమలో ఎంపీసీలో అర్షిణి 467 మార్కులు, పి.అక్షయ 466, బైపీసీలో జో.ప్రశాంత్ 434, సీఈసీలో అఫ్సా బేగం 488, ఎంఈసీలో ఫిర్దోస్ 467 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఉపేందర్, అకాడమిక్ ప్రిన్సిపల్ ఎం.కుమార్, అధ్యాపకులు అభినందించారు.

మహాత్మాజ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల కళాశాలకు చెందిన బాలభద్ర హాసిని ఎంపీసీలో 986 మార్కులు సాధించింది. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో అస్రా కవీమా 980, డి.శ్రీవాణి 973, సీఈసీలో ఎండి.సాదాగాని 951 మార్కులు, కె.స్ఫూర్తి హెచ్‌సీలో 978 మార్కులు సాధించారు. వొకేషనల్ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో టి.అక్షిత 433, బైపీసీలో బి.శ్రీకృష్ణ 425, హెచ్ఈసీలో కాషఫ్ 477, సీఈసీలో ఎం.అనన్య 477 మార్కులు సాధించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ఎంపీసీలో బి.అరుణ్‌తేజ 868, సీఈసీలో ఎస్.నరేందర్ 701, హెచ్ఈసీలో సింధు 781 మార్కులతో పాటు వొకేషనల్ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించారు.

విఠల్‌నగర్‌కు చెందిన కన్నాపురం స్ఫూర్తి ఇంటర్మీడియెట్ ఫలితాల్లో హెచ్ఈసీ గ్రూప్ 978 మార్కులు సాధించింది. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదివిన స్ఫూర్తి మొదటి సంవత్సరం 493 మార్కులు సాధించింది.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

(5వ పేజీ తరువాయి)

మంది విద్యార్థులకు 650 మంది 60.85 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 501 మందికి 212 మంది 42.32 శాతం, బాలికలు 568 మంది విద్యార్థులకు 438 మంది 77.11 శాతం ఉత్తీర్ణులయ్యారు.

- ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షల్లో 3797 మంది విద్యార్థులకు 2659 మంది 70.03 శాతం ఉత్తీ ర్ణులయ్యారు. ఇందులో బాలురు 1579 మందికి 895 మంది 56.68 శాతం, బాలికలు 2218 మందికి 1764 మంది 79.53 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వొకేషనల్ విభాగంలో 918 మందికి 700 మంది 76.25 శాతం ఉత్తీర్ణులయ్యారు. బాలురు 407 మంది విద్యా ర్థులకు 236 మంది, 57.99 శాతం, బాలికలు 511 మందికిగాను 464 మంది విద్యార్థులు 90.80 శాతం ఉత్తీర్ణులయ్యారు.

అభివృద్ధి పనులకు పెద్దపీట

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, పార్టీ అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, బ్లాక్-2 అధ్యక్షులు కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కొడారి హన్మయ్య, కాడె సూర్య నారాయణ, దేవి జనార్దన్, కొత్త నర్సింహులు, అజయ్, పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై ప్రభుత్వ విప్ విమర్శించారు. ధర్మపురి నియోజక వర్గం అభివృద్ధి చెందలేదని, అప్పటి నాయకుడు 50 ఏళ్ళ ప్రస్థానం పేరుతో పుస్తకం రాయించుకోవడం సంతోషకరమే గాని, అదే పుస్తకంలో ధర్మపురి నియోజకవర్గానికి ఏం చేశారో రాసి ఉంటే బాగుండేదని పరోక్షంగా విమర్శించారు.

అలాగే ధర్మారం, కమ్మరిఖాన్‌పేట, అబ్బా పూర్, కటికెనపల్లి, చామనపల్లి గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను డీసిఓ శ్రీమాలతో కలిసి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యం కల్పించాలని కోరారు. వచ్చే నెల 6 నుండి 13 వరకు లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో జరిగే బ్రహ్మోత్సవాల పోస్టర్ ప్రభుత్వ విప్, దేవస్థాన చైర్మెన్ పోలుదాసరి సంతోష్‌తో కలిసి ఆవిష్కరించారు.

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామశివారు యోగానందా లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.

ఎంఐఎం నుంచి పేద ముస్లింలకు విముక్తి

పెద్దపల్లిటౌన్, ఎప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) పేద ముస్లింల కష్టాన్ని దోచుకుంటున్న ఎంఐఎం పార్టీ నుంచి విముక్తిని కలిగించడానికే వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలుపరిచినట్లు మాజీ ఎమ్మెల్యే, గుజ్జుల రామక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. గుజ్జుల మాట్లాడుతూ సబ్ కా సాత్ సబ్ కా వికాస్ పేరుతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి అవకాశాలు కల్పిస్తుందని గుర్తుచేశారు.

బొడ్రాయి ఉత్సవంలో పాల్గొన్న ఎంపీ

పాలకుర్తి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండలం కన్నాల అనుబంధ గ్రామాలైన బోడగుట్టపల్లి, నక్కిరెడ్డిపల్లి, కొత్తపల్లి, రజ్వీకాలనీల్లో నిర్వహించిన బొడ్రాయి ఉత్సవాల్లో ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంగళవారం పాల్గొన్నారు. గ్రామాల్లో జరుగుతున్న శ్రీలక్ష్మి, భూలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన యువకులను ఎంపీ అభినందించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

ఎలిగేడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎలిగేడు గ్రామపంచాయతీ పరిధిలో తాగునీరు, పారిశుధ్య పనులను పరిశీలించి, అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తాగునీటి సమస్యలు ఏర్పడకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగిలే ప్రమాదం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల నమోదు హాజరు స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఎంపీఓ కిరణ్, కార్యదర్శి అంజలి, అంగన్వాడీ టీచర్ లత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య బృందానికి కలెక్టర్ అభినందన

పెద్దపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): క్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా జిల్లా ఆసుపత్రిలో నిర్వహించినందుకు వైద్య బృందాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన 92 సంవత్సరాల వయస్సు గల గొట్టేముక్కల వీరారెడ్డి ఎడమ వైపు తుంటి ఎముక ఫ్రాక్చర్‌తో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 12న అడ్మిట్ అయ్యారు. ఎక్కువ వయస్సు, రెండు కిడ్నీలు సరిగా పని చేయక పోవడం, గుండె పని తీరు సామర్థ్యము తక్కువ ఉండటంతో ఇద్దరు కొడుకుల సమ్మతితో డాక్టర్ కే శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ భవాని, డాక్టర్ రామం, సూపరింటెండెంట్ డాక్టర్ కె శ్రీధర్ పర్యవేక్షణలో మంగళవారం శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సుల్తానాబాద్ పట్టణంలోని దుర్గానగర్‌కు ఆసియ తబసుమ్ షేక్ కడుపు నొప్పితో ప్రైవేట్ ఆసుపత్రిలో సంప్రదించగా గర్భ సంచి పక్కన వున్న ట్యూబ్‌లో గర్భం ఏర్పడిందని తెలిపారు. అది పగిలి రక్తస్రావంతో పెద్దపల్లి మాత శిశు ఆసుపత్రిలో సంప్రదించగా డ్యూటీలో ఉన్నా డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రామం సకాలంలో స్పందించి మంగళవారం క్రిటికల్ శస్త్ర చికిత్స నిర్వహించారని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని ఎంఈఓ మహేష్ అన్నారు. మంగళవారం జాఫర్‌ఖాన్‌పేటలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఈవిద్యా సంవత్సరం నుండి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యాబోధన జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలవద్ద అడ్మిషన్ తీసుకొన్నారు. హెచ్ఎం ప్రకాశ్‌రావు, ఉపాధ్యాయులు దేవేందర్, కూచయ్య, మమత, మేరీ, సీఆర్పీ కురుమచెట్టి చందర్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గంగారంలో గీత కార్మికులు మంగళవారం ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నూతన వస్త్రాలు ధరించి బోనం ఎత్తుకొని ఎల్లమ్మ తల్లి దేవాలయం వరకు డప్పు చప్పులతో శివసత్తుల పూనకాలతో వెళ్లి బోనం సమర్పించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు మేడ్ అశోక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.

పారిశుధ్య కార్మికుల శ్రమ వెలకట్ట లేనిది

జ్యోతినగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ పీటీఎస్ కాకతీయ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. మక్కాన్‌సింగ్ మాటాడుతూ పారిశుధ్య కార్మికులకు తాను అండగా ఉంటామన్నారు. అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ జె.అరుణశ్రీ, అధికారులు, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వం

అంతర్గాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. మంగళవారం పెద్దంపేట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ తూము రవీందర్ పటేల్, ఎంపీడీఓ వేణు మాధవ్, కాంగ్రెస్ నాయకులు ఉరిమెట్ల రాజలింగం, పెండ్యాల మహేష్, పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

జూలపల్లి, ఏప్రిల్ 22. (ఆంధ్రజ్యోతి): వడుకాపూర్ గ్రామానికి చెందిన గుమ్మడి లక్ష్మణ్ లివర్ వ్యాధితో మంగళవారం మృతి చెందాడు. జాండిస్ సోకి లివర్ డ్యామేజ్ అయిందని, ఆపరేషన్ చేయాలని లేకుంటే ప్రాణాపాయం తప్పదని వైద్యులు పేర్కొన్నారు. దీంతో లక్ష్మణ్ భార్య మమత లివర్‌లోని కొంత భాగాన్ని భర్తకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించారు. కాని కొన్ని రోజులకే తీవ్ర అనారోగ్యానికి గురైన లక్ష్మణ్ భార్య మమత తొమ్మిది నెలల క్రితం మృతిచెందినది. లక్ష్మణ్ మృతి చెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపాయి. లక్ష్మణ్‌కు ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు.

తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు రూపొందించిన తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో ఉపాధ్యాయులకు ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024-25లో తొలిమెట్టు కార్యక్రమం ద్వారా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు చదవడం, రాయడం, గణితంలో కనీస అభ్యాసన సామర్థ్యం అందించేందుకు ఉపాధ్యాయులు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఉపాధ్యాయులు ఇదే స్ఫూర్తితో రాబోయే విద్యా సంవత్సరంలో కూడా ప్రత్యేక శ్రద్ధతో కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. జూన్‌లో పదవి విరమణ పొందుతున్న కల్వచర్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శోభన్‌రావు, మల్యాల జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సత్యలక్ష్మిలను కలెక్టర్ సన్మానించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, పాఠశాల అకడామిక్ అధికారి పీఎం షేక్, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షీ టీంపై అవగాహన

జ్యోతినగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు మంగళవారం కమిషనరేట్ షీటీం సిబ్బంది అవగాహన కల్పించారు. షీ టీం ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య మాట్లాడు తూ విద్యార్థినులు, మహిళల భద్రత కోసమే షీ టీంలను ఏర్పాటు చేశారని, అన్ని కళాశాలలు, విద్యా సంస్థల వద్ద, ప్రధానమైన కూడళ్లలలో షీ టీం నిత్యం ఉంటాయన్నారు. విద్యార్థులను ఎవరైన లైంగిక వేధింపులకు గురి చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. లోన్ యాప్‌లు, మొబైల్ ఫోన్లలో వచ్చే ఫేక్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండా లని, ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు స్నేహలత, సురేష్, మౌనిక, కేవీ ప్రిన్సిపాల్ శోభన్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

కోల్‌సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులను ఎంపిక చేయడానికి దరఖాస్తుదారులకు బుధవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఆయా బ్యాంకు ల అధికారులు నిర్వహించే ఇంటర్వ్యూలకు దరఖాస్తులో సూచించిన బ్యాంకుల వారీగా షెడ్యూలు ప్రకారం హాజరు కావాలని కోరారు. 23న ఉదయం 10గంటలకు ఎస్‌బీఐ ఎన్టీపీసీ, రామగుండం శాఖ, 24న ఎస్‌బీఐ మున్సిపల్ కాంప్లెక్స్, జన్నారం శాఖ, 25న ఎస్‌బీఐ ఎస్‌సీసీఎల్, విఠల్‌నగర్, లక్ష్మీనగర్‌శాఖలు, 28న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గోదావరిఖని, మేడిపల్లి లింగాపురం శాఖ, యైటింక్లయిన్‌కాలనీ శాఖ, 29న యూనియన్ బ్యాంకు మార్కండేయకాలనీ, రమేష్‌నగర్, 30న తెలంగాణ గ్రామీణ బ్యాంక్, గోదావరిఖని శాఖ, మేడిపల్లి చౌరస్తా, బ్యాంక్ ఆఫ్ ఇండియా జ్యోతినగర్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, మిగిలిన అన్ని ఇతర బ్యాంకు శాఖలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు ఆధార్, పాన్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్, కుల ధ్రువీకరణ, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అమర్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణానికి హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులకు శ్రీవల్లి సేవా సంస్థ సభ్యులు సేవలందించారు. సాయంత్రం గరుడ వాహన సేవ నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా సాగిన ఈ గరుడ వాహన సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాయమల్లు గౌడ్ మృతి తీరని లోటు

సుల్తానాబాద్ ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పూసాల గ్రామానికి చెందిన మావోయిస్టు సానుభూతిపరుడు బండి రాయమల్లు గౌడ్ (75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పలువురు మానవ హక్కుల సంఘం నేతలు, మావోయిస్టు సానుభూతిపరులు మంగళవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన నాయకులు జోహర్లు అంటూ అమర్ హై అంటూ నినాదాలు చేశారు.. భార్య బండి లక్ష్మి, కుమారులు బండి శంకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సతీష్ గౌడ్, కూతుర్లు దూలం శారద, పద్మ పరామర్శించారు. మాదన కుమారస్వామి, శ్రీపతి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర పరిధిలోని గనులు సింగరేణికి కేటాయించాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని బొగ్గు గనులు సింగరేణికే దక్కేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని మంగళవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆర్జీ-2 పరిధిలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. వీకేపీ గనిలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ మాట్లాడారు. అపార అనుభవం ఉన్న సింగరేణికి గనులు కేటాయించడం ద్వారా ప్రభుత్వాలకు లాభం చేకూరుతుందన్నారు. గనుల వేలం విధానాన్ని నిలిపివేయాలన్నారు. మెడికల్ రెఫరల్ విధానాన్ని సులభతరం చేసి కార్మికులకు కార్పొరేట్ హాస్పిటల్‌లో అయినా వైద్య సేవలు అందేలా మెడికల్ కార్డు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐ సత్యం, బేతి చంద్ర య్య, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించండి

గోదావరిఖని, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలని టీబీజీకేఎస్ ఆర్‌జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే2ఇంక్లైన్‌లో కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త గనుల తవ్వకాలను వెంటనే ప్రారంభించాలని, సంస్థను కాపాడుకోవాలంటే నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమాన్ని మెరుగు పర్చాలన్నారు. సంస్థలో మెడికల్ రెఫర్‌లను సులభతరం చేసి యాజమాన్యమే సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రామగుండం, కొత్తగూడెం, బెల్లంపల్లి రీజియన్‌లో కార్మికులకు రక్షిత మంచినీటిని అందించాలని కోరారు. రామ గుండంలో క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నా యని, వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం హెచ్‌ఓడీకి వినతి పత్రం అందజే శారు. పొలాడి శ్రీనివాసరావు, దూట శేషగిరి, మీస రాజు, తిరుపతి, దేవేందర్, నరేష్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ బాయిబాట

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 సీహెచ్‌పీలో మంగళవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బాయిబాట కార్యక్రమం జరిగింది. ఐఎన్‌టీయూసీ బృందం కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. డిపెండెంట్‌ల వయోపరిమితి 40 ఏళ్ళకు పెంపు, కాంట్రాక్టు కార్మికులకు రూ. 5000 బోనస్‌తో పాటు పలు సమస్యలు యూనియన్ ఆధ్వర్యంలో పరిష్కరించినట్లు ఏరియా వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. దశరథ, నవీన్‌కుమార్, ప్రణయ్ భాస్కర్ పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్ షిప్ సర్క్యులర్ విడుదల చేసిన యాజమాన్యం

గోదావరిఖని, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఏఐటీయూసీ కృషితో యాజమాన్యం మెరిట్ స్కాలర్ షిప్ సర్క్యులర్ జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో కార్మికుల పిల్లలకు గతంలో 2000ర్యాంక్ వచ్చి, ప్రభుత్వ కాలేజ్ లో సీట్ వస్తే రూ.10వేల స్కాలర్‌షిప్ వచ్చేదని, సంవత్సరానికి 57మందికి గాను 6నుంచి 8మందికి మాత్రమే వచ్చేదని, దీని వల్ల చాలా మంది అర్హులైన కార్మికుల పిల్లలకు నష్టం జరుగుతుందని యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై ఏఐటీయూసీ యూనియన్ కొత్తగూడెంలో డైరెక్టర్ (పా) స్ట్రక్చర్ మీటింగులో మాట్లాడి 2000ర్యాంక్‌కు బదులుగా 8000 ర్యాంక్ వరకు వచ్చిన వారికి రూ.10వేల నుండి రూ.16వేల స్కాలర్ షిప్ ఇవ్వడానికి యాజమాన్యాన్ని ఒప్పించామన్నారు.